# తీహారు జైలులో హత్య

అకస్మాత్తుగా భయంకరంగా సైరన్ మోగింది.

తీహార్ జైల్లో ఖైదీలు, పని వాళ్ళు అటూ ఇటూ గాభరాగా పరిగెడుతున్నారు. జైల్లో కావలా వున్న సిపాయిలూ, జైలరూ కూడా లోపలికి పరిగెత్తారు.

వార్డ్ నెం. 80లో గొడవ జరుగుతోంది. ఈ వార్డులో హత్యా నేరంతో శిక్ష అనుభవిస్తున్న వాళ్ళని ఉంచుతారు. ఆవార్డులోని మదన్ లాల్ అనే ఖైదీ వార్డర్ సురేంద్ర కుమార్ మీద అరుస్తున్నాడు. ఆ ఖైదీ చేతిలో సన్నటి, పొడుగైన చాకు కూడా వుంది.

"ఏమిటి సంగతి?" అని జైలరు శివకుమార శర్మ అడిగాడు.

"సర్! మదన్‌లాల్ అర్థగంట నుంచి తన సెల్‌లోకి పోనని గొడవ చేస్తున్నాడు. ఇంకా కొంతసేపు బయటే ఉంటాననంటున్నాడు. నేనతన్ని బలవంతంగా లోపలికి పంపించడానికి ప్రయత్నిస్తున్నాను." (జైలు రూల్సు ప్రకారం హత్య కేసులో శిక్ష పొందుతున్న వాళ్లని సాయంత్రం ఆరున్నర తరువాత వాళ్ల సెల్ బయట ఉండనివ్వరు.)

"అందుకే అతను నన్ను చంపుతానని చాకు చూపిస్తున్నాడు". అంటూ సురేంద్ర కుమార్ తన కుడి బుజాన్ని చూపించాడు.

అతని చొక్కా రక్తంతో తడిసి ఉంది. అది చూసి శివకుమార్ కోపం తారాస్థాయి నందుకుంది.

"తన్నండి గాడిదను" అని అరిచాడు. అతని నోట్లోంచి ఆ మాటలు వచ్చీ రాక ముందే వార్డర్‌తో పాటు మరో ముగ్గురు రక్షక భటులు కూడా మదన్‌లాల్ మీద విరుచుకు పడ్డారు. చిత్తుగా తన్నేశారు. దెబ్బల్తో నేలమీద పడిపోయిన అతన్ని జైలు అధికారులు సెల్‌లో పడేసి తలుపువేశారు.

ఈ సంఘటన 1981వ సంవత్సరం ఏప్రిల్ పధ్నాల్గో తేదీ సాయంత్రం 6-30 గంటలకు జరిగింది.

లాకప్‌లో మదన్‌లాల్ ఆ రాత్రంతా మూలుగుతూనే వున్నాడు. అతను ఛాతీలో నొప్పి అంటూ అరవ సాగాడు. రక్తం కక్కుకున్నాడు. అతని అరుపులు వినికూడా జైలు అధికారులు పట్టించుకోలేదు. రెండో రోజు ఉదయం అతను సెల్ నుంచి బయటికి రాలేదు. అతను లేచి నుంచునే పరిస్థితిలో లేడు. మూల్గుతూ పడుకున్నాడు. అంతలో ఒక వార్డర్ వచ్చి "మీ తల్లీ, భార్య వచ్చారు!" అని చెప్పాడు కొంచెం అతని పైకి వంగుతూ. "ఒక మూడు వందల రూపాయలు సర్దగలిగితే భవిష్యత్తులో నీ ఒంటి మీద దెబ్బ పడకుండా చూసుకుంటాను!" అని గుసగుసగా చెప్పాడు.

మదన్‌లాల్ తన భార్యనూ, తల్లినీ చూస్తానన్నాడు. డబ్బు ఇచ్చే ప్రయత్నం కూడా చూస్తానన్నాడు. మదన్‌లాల్ తల్లికి దెబ్బలు కన్పించకుండా ఎర్ర గుడ్డ చుట్టారు. సెల్ నుంచి బయటికి తీశారు.

కటకటాల వెనక నిల్చున్న కొడుకుని చూసి తల్లీ, ఒళ్లంతా గాయాల్తో వున్న భర్తను చూసిన భార్యా కన్నీళ్లు కార్చారు.

తల్లి "ఏం నాయనా అలా అయిపోయావేం" అనడిగింది.

"రాత్రి తనను కొట్టారని, ఒక మూడు వందల రూపాయలు పర్గగలిగితే ఇకముందు కొట్టరనీ తల్లితో చెప్పాడు." మదన్‌లాల్.

ఆ స్త్రీ లిద్దరూ ఏడుస్తూ ఇంటికొచ్చారు. మదన్‌లాల్ తల్లి తన రెండో కొడుకు రాజేంద్రకుమార్‌తో అన్ని విషయాలూ చెప్పింది.

రాజేంద్రకుమార్ డబ్బు సంగతి తను చూసుకుంటానని తల్లినీ వదినను ఓదార్చాడు.

జైల్లో మదన్‌లాల్‌కి తీవ్రమైన జ్వరం వచ్చింది. అతని పరిస్థితి ప్రమాదకరంగా వుందని తెలిసి హాస్పిటల్‌లో చేర్పించారు. అదేరాత్రి పన్నెండు గంటల పది నిమిషాలకు లోకనాయక్ జయప్రకాశ్ నారాయణ్ వార్డులో (ఎమర్జెన్సీ వార్డులో) వుంచారు. డాక్టర్లు అతనికి తగలరాని చోట కన్పించని దెబ్బలు తగిలాయని బ్రతకడం కష్టమనీ చెప్పేశారు.

ఏప్రిల్ 16వ తేదీన మదన్‌లాల్ నుంచి చీఫ్ జైలరు వాఙ్మూలం తీసుకున్నాడు.అసిస్టెంట్ జైలర్‌శివకుమార్ ఆజ్ఞాపించటంతో' సురేందర్' అనే వార్డరూ, మరో ముగ్గురూ కలిసి తనని కొట్టారని చెప్పాడు. కొట్టిన వాళ్ళలో ఒక ఖైదీ కూడా ఉన్నాడని చెప్పాడు. అతను ఈ మాటల్ని అతి కష్టంమీద ఆగి, ఆగి చెప్పాడు.

అదే రోజు ఉదయం 10 గంటలకు మదన్‌లాల్ తమ్ముడు రాజేంద్రకుమార్ జైలు దగ్గర కొచ్చాడు. తన అన్న ఆరోగ్యం సరి లేనందున హాస్పిటల్‌లో చేర్చబడ్డాడని తెలుసుకున్నాడు. అక్కణ్ణుంచి అతను హాస్పిటల్‌లోకి వచ్చాడు. అతను హాస్పిటల్‌కు చేరేసరికి ఒంటి గంటయింది.

గబ గబా మదన్‌లాల్ వున్న వార్డులోకి పరిగెత్తాడు. అప్పటికే అతను శాశ్వతంగా కన్నుమూశాడు. మీద కప్పి వున్న దుప్పటిని తొలగించి హాస్పిటల్ అధికారులు తమ్ముడికి అన్న ముఖాన్ని చూపించారు. ముఖం బాగా ఉబ్బి వుంది. దెబ్బల గుర్తులు స్పష్టంగా తెలుస్తున్నాయి.

రాజేంద్రకుమార్ వెక్కి వెక్కి ఏడ్చాడు.

మదన్‌లాల్ తన మేనత్త కొడుకైన నారాయణ్‌ను చంపాడన్న ఆరోపణ వల్ల జైలు శిక్షను అనుభవిస్తున్నాడు. నారాయణ్, మదన్‌లాల్ చాలా స్నేహంగా ఉండేవారు. ఒకరోజు ఇద్దరూ కూర్చుని తాగుతున్నారు. తాగుడు మైకంలో మాట మాట పెరిగింది. నారాయణ్ ఎదురుగా వున్న సారాసీసాను పగలగొట్టాడు. మదన్‌లాల్ కోపంతో ఊగిపోయాడు. పగిలిపోయిన సీసా చేతపట్టుకుని నారాయణ్ గొంతుమీద కొట్టాడు. మెడనరాలు తెగిపోయిన నారాయణ్ అక్కడికక్కడే మృత్యువు వాత పడ్డాడు. మదన్‌లాల్‌ను అరెస్టు చేశారు. క్రింద కోర్టు మదన్‌లాల్‌కి ఇరువై ఏళ్ళు శిక్ష విధించింది. కాని హైకోర్టు మాత్రం అతనికి శిక్షా కాలాన్ని తగ్గించి 20 నుంచి 5 సంవత్సరాలు చేసింది. అప్పటికి రెండు సంవత్సరాలుగా మదన్‌లాల్ జైల్లో ఉన్నాడు. చనిపోయే నాటికి అతని వయసు 28 సంవత్సరాలు.

మదన్‌లాల్ మృత్యువుతో తీహార్ జైల్లో అలజడి ప్రారంభం అయింది. వార్డు నెం 80లో ఉండే ఖైదీలంతా ఆమరణ నిరాహారదీక్ష ప్రారంభించారు. మదన్‌లాల్ హత్యకు కారకులైన అధికారులను అరెస్ట్ చేయాలని డిమాండు చేశారు.

జైలు అధికారులు సందిగ్ధంలో పడిపోయారు. ఈ సంగతి ప్రభుత్వానికి తెలిసింది. అడిషనల్ జిల్లా మేజిస్ట్రేట్‌ను ఎంక్వయిరీ

జరపవలసిందిగా కోరడం జరిగింది. జిల్లా మేజిస్ట్రేట్ అర్ఫే విచారణ జరిపి మదన్‌లాల్ మృత్యువుకు సంబంధించిన 150 పేజీల రిపోర్టు ప్రభుత్వానికి పంపించాడు. ఆయన రిపోర్టులో మదన్‌లాల్ మృత్యువు అసహజ మయినదనీ, చాలా పదునైన ఆయుధాలతో అతన్ని గాయ పర్చారనీ, ఇందుకు జైలు అధికారులు బాధ్యులనీ నిర్ద్వంద్వంగా తెలిపాడు.

మార్చి 26వ తేదీన జైలు అధికారి శివకుమార్ అరెస్టు చెయ్య కుండా కోర్టు రక్షణ కోసం అప్లయి చేసుకున్నాడు. కాని కోర్టు అంగీక రించలేదు.

1981 మే 28వ తేదీ శివకుమార్, సురేంద్ర తమంతట తామే పోలీసులకి లొంగిపోయారు.

తీహార్ జైల్లో జరిగిన ఈ ఉదంతం వలన మిగతా జైళ్ల పరి స్థితులు బాగుపడతాయని ఆశించవచ్చునా?